
సాక్షి
అన్నమయ్య జిల్లా

ఆదివారం । 13 । జులై । 2025



ప్రశ్నార్థకంగా హైవే కనెక్టివిటీ!
శేషాచలం అటవీ ప్రాంతంలో పచ్చటి ప్రకృతి ఒడిలో ఆహ్లాదకరమైన ప్రయాణం సాగించే గ్రీన్‌హైవే (కడప-రేణిగుంట నేషనల్ హైవే నుంచి అప్రోచ్‌రోడ్స్ నిర్మితం) ప్రశ్నార్థకంగా మారింది. - 8లో



రాత్రి రెక్కీ.. పగలు నొక్కి..
రాత్రి వేళల్లో రెక్కీ నిర్వహించి. పగటిపూట తాళాలు వేసిన ఇళ్లలో చోరీకి పాల్పడే నిందితుడిని పోలీసులు అరెస్టు చేశారు. నిందితుడి నుంచి బంగారం, నగదు స్వాధీనం చేసుకున్నారు. - 8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.260	రూ.330
రెండోరకం	రూ.180	రూ.240

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 997 మెట్రిక్ టన్నులు



న్యూస్‌రీల్

16న కౌన్సెలింగ్

మదనపల్లె : వైఎస్సార్ కడప, అన్నమయ్యజిల్లాల్లోని 24 అంబేడ్కర్ గురుకుల, విద్యాలయాల్లో 6, 7, 8, 9 తరగతుల ప్రవేశానికి ప్రవేశ పరీక్ష రాసి సీట్లు లభించని విద్యార్థులకు ఈనెల 16న కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు అంబేడ్కర్ గురుకుల విద్యాలయాల సమన్వయకర్త ఎ.ఉదయశ్రీ శనివారం తెలిపారు. కడప చిన్నచౌక్‌లోని గురుకుల వి ద్యాలయంలో వచ్చే బుధవారం విద్యార్థులు కౌ న్సెలింగ్‌కు హాజరై సీట్లు పొందొచ్చని తెలిపారు.

ఆలయాలకు ధర్మకర్తల నియామకానికి దరఖాస్తులు

మదనపల్లె : జిల్లాలోని ప్రముఖ ఆలయాలకు ధర్మకర్తల మండలి నియామకం కోసం ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసింది. ఈ మేరకు అర్హత కలిగిన వారు 20 రోజుల్లోపు దరఖాస్తులు చేసుకోవాల్సి ఉంటుందని జిల్లా దేవాదాయ అధికారి విశ్వనాథ్ శనివారం తెలిపారు. జిల్లాలోని మదనపల్లె మండలం బసినికొండకు చెందిన కనుమలో గంగమ్మ, నిమ్మనపల్లె మండలం తవళంలోని నేలమల్లేశ్వరస్వామి ఆలయం , పీలేరు మండలం దొడ్డిపల్లెకి చెందిన చెన్నకేశవస్వామి ఆలయం, పీలేరుకు చెందిన రౌద్రాల అంకాలమ్మ ఆలయం, రాజంపేట మండలం హత్యారాల గ్రామంలోని కామాక్షి ప్రతేశ్వర స్వామి ఆలయం, రైల్వేకోడూరులోని భుజంగేశ్వర స్వామి ఆలయం, కురబలకోట మండలం తెట్టులోని సంతాన వేణుగోపాలస్వామి ఆలయంకు దర్మకర్తల మండలిని నియమిస్తారు. దీనికోసం అసక్తి కలిగి, అర్హులైన వారు ఈనెల 29లోపు సెక్షన్ 17 (3) ప్రకారం సూచించిన ప్రొఫార్మాలో దరఖాస్తులను జిల్లా దేవదాయశాఖ అధికారికి పంపాలని విశ్వనాథ్ కోరారు.

ధర్మవరం నుంచి చర్లపల్లికి వీక్లీ స్పెషల్ ట్రైన్

కలికిరి : ప్రయాణికుల రద్దీ దృష్ట్యా చర్లపల్లి నుంచి ధర్మవరం వరకు వీక్లీ స్పెషల్ రైలును ఈ నెల 13వ తేదీ నుంచి ఆగస్టు 25 వరకు తిరగనుంది. ప్రతి ఆదివారం చర్లపల్లిలో రాత్రి 7.55 గంటలకు బయలుదేరే ఈ స్పెషల్ రైలు పగిడిపల్లి, నల్గొండ, మిర్యాలగూడ, నడికుడి జంక్షన్, సత్తెనపల్లి, గుంటూరు, తెనాలి, బాపట్ల, ఒంగోలు, నెల్లూరు, గూడూరు, తిరుపతి మీదుగా పాకాలకు మరుసటి రోజు ఉదయం 10.05 గంటలకు, పీలేరుకు 10.45 గంటలకు, కలికిరికి 11.05 గంటలకు, మదనపల్లె రోడ్‌కు 11.30 గంటలకు, కదిరికి మధ్యాహ్నం 12.35 గంటలకు, ధర్మవరానికి 3 గంటలకు చేరుకుంటుంది. తిరిగి సోమవారం 4.30 గంటలకు ధర్మవరంలో బయలుదేరి కలికిరి 7 గంటలకు, పాకాలకు 8 గంటలకు, తిరుపతికి రాత్రి 9 గంటలకు మరుసటి రోజు మంగళవారం ఉదయం 11 గంటలకు చర్లపల్లి స్టేషన్‌కు చేరుకుంటుంది. ఈ నెల 13, 20, 27, ఆగస్టు 3, 10, 17, 24 తేదీల్లో చర్లపల్లిలోనూ, ఈ నెల 14, 21, 28, ఆగస్టు 4, 11, 18, 25 తేదీల్లో ధర్మవరంలోనూ ఈ రైలు బయల్దేరుతుంది.

ఉప్పల హారికపై దాడి హేయమైన చర్య


మహిత

రాయచోటి : రాష్ట్రంలో కూటమి పాలకులు మహిళలపై దాడులు చేయడం వారి నిరంకుశత్వ పాలనకు అద్దం పడుతోందని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర మహిళా విభాగం జనరల్ సెక్రటరీ మహిత అన్నారు. శనివారం ఆమె మాట్లాడుతూ కృష్ణాజిల్లా గుడివాడలో జిల్లా పరిషత్ చైర్మన్ ఉప్పల హారిక పై టీడీపీ గూండాలు దాడి చేసి హత్యాయత్నానికి పాల్పడిన సంఘటనపై ప్రభుత్వం సిగ్గుతో తలదించుకోవాలన్నారు. కూటమి పాలనలో రాష్ట్రంలో మహిళలకు రక్షణ కరువైందన్నారు.ఓ ప్రజా ప్రతినిధిగా ఉన్న మహిళను నోటితో చెప్పలేని విధంగా అసభ్య పదజాలంతో దూషించడం దుర్మార్గమన్నారు. మహిళా హోం మంత్రి ఉన్న రాష్ట్రంలో మహిళలకు రక్షణ లేకుండా పోయింది. ఈ ప్రభుత్వానికి రానున్న రోజుల్లో ప్రజలు బుద్ధి చెబుతారని పేర్కొన్నారు.

బీటీ కళాశాలపై టీడీపీ గద్దలు?

- జీసీటీలో సభ్యులుగా ఇద్దరు టీడీపీ వర్గీయులు చేరారని ప్రచారం
- 99 ఏళ్ల లీజు పేరిట వందల కోట్ల విలువైన ఆస్తులు దక్కించుకునేందుకు యత్నాలు?
- కళాశాల వ్యవహారాలపై దృష్టి పెట్టని ట్రస్టు సభ్యులు
- గాలికి వదిలేసిన కూటమి ప్రభుత్వం




మదనపల్లె బీసెంట్ థియోసాఫికల్ కళాశాల

మదనపల్లె : చరిత్రాత్మక మదనపల్లె బీసెంట్ థియోసాఫికల్ కళాశాలను తన్నుకుపోయేందుకు టీడీపీ గద్దలు వాలుతున్నాయి. తిమ్మిని బమ్మిని చేసైనా కళాశాలను దక్కించుకుని అందులో ప్రైవేటు సామ్రాజ్యం నెలకొల్పే ప్రయత్నాలు సాగుతున్నట్లు తెలుస్తుండగా, ఈ విషయంపై టీడీపీ వర్గాల్లో ప్రచారం సాగుతోంది. దీనికి తగ్గట్టు తాజా పరిస్థితులు గందరగోళంగా ఉండగా, ఈ ప్రచార నేపథ్యంలో బీటీ కళాశాలను తిరిగి ఎయిడెడ్ కళాశాలగా మారుస్తారా లేక ప్రభుత్వ నిర్వహణలో అభివృద్ధి చేస్తారా అని విద్యార్థి సంఘాలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నాయి. దీనిపై స్పష్టత లేనప్పటికి కళాశాల ప్రైవేటు చేతుల్లోకి వెళ్లిపోతుందా అన్న ఆందోళన సర్వత్రా నెలకొంది.

మిథున్‌రెడ్డితో న్యాయం

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో బీటీ కళాశాలకు పూర్వ వైభవం తీసుకురావాలని నిర్ణయించింది. విద్యార్థి సంఘాల ఆందోళనలకు స్పందించిన రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డి కళాశాల చారిత్రిక నేపథ్యం, అభివృద్ధి చేయాల్సిన ఆవశ్యకతను గుర్తించి కళాశాల ప్రభుత్వపరం అయ్యేలా కృషి చేయగా ప్రభుత్వ ఉత్తర్వు జారీ అయ్యింది. అప్పటినుంచి బిసెంట్ సెంటినరీ ట్రస్టు (బీసీటీ) పరిధిలోని డిగ్రీ కళాశాల ప్రభుత్వ కళాశాలగా మారిపోయింది. దీంతో కళాశాల అభివృద్ధికి వివిధ చర్యలు చేపట్టింది. టీచింగ్, నాన్ టీచింగ్ సిబ్బంది నియామకం చేపట్టడమే కాక ఎంపీ మిథున్‌రెడ్డి కృషితో బీటీ కళాశాలను అనిబిసెంట్ విశ్వవిద్యాలయంగా మారుస్తూ ఉత్తర్వు జారీ చేసింది. ఇలా కళాశాల అభ్యున్నతికి, భవిష్యత్ ప్రణాళికలను వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కృషి చేసింది.

లీజు పేరిట టీడీపీ కన్ను

కళాశాల అభివృద్ధిని ఏ మాత్రం పట్టించుకోని కూటమి ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం చేస్తోంది. దీన్ని ఆసరాగా చేసుకుని ఈ కళాశాల యాజమాన్యానికి చెందిన టీడీపీ వ్యక్తి ఒకరు, అక్కడే పని చేస్తున్న మరో టీడీపీ వర్గీయుడు ఈ కళాశాలను దక్కించుకునే యత్నాలు ముమ్మరం చేసినట్లు విద్యా వర్గాల్లో ప్రచారం సాగుతోంది. ముందుగా బీసీటీ సభ్యులైతే దీనిని చేజిక్కించుకోవడం సులువని భావించి చెన్నైలో ఉంటున్న కొందరు సభ్యులతో సఖ్యతగా ఉంటూ అందులో సభ్యత్వం తీసుకున్నారని ప్రచారం జరుగుతోంది. ఇదే విషయాన్ని ఆ ఇద్దరిలో ఒకరు తాము బీసీటీలో సభ్యులమయ్యామంటూ ప్రచారం చేసుకుంటున్నారని పలువురు చెప్పారు. ఈ కళాశాలను 99 ఏళ్ల లీజు పేరిట దక్కించుకుని అందులో కోట్ల విలువైన భూములు, కోట్ల విలువైన ఆస్తులను తమ ఆధీనంలోకి తీసుకుని విద్యా సంస్థలను అందులో ప్రారంభించాలన్న ఆలోచనతో ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. కళాశాల నిర్వహణలో అనుభవం కలిగిన ఆ వ్యక్తులు మదనపల్లె పట్టణ నడిబొడ్డున వందల కోట్ల విలువైన బీసీటీ ఆస్తులు, కళాశాలను ఎలాగైనా దక్కించుకునే ప్రయత్నాల్లో ఉన్నట్లు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.

పట్టించుకోని ట్రస్టు

బీటీ కళాశాల స్థితి గతులు, అభివృద్ధి, చేపట్టాల్సిన చర్యలపై ట్రస్టు సభ్యులు పట్టించుకోవడం లేదు. ఇక్కడ పర్యటించి ఏమి జరుగుతోందో పరిశీలించి నిర్ణయాలు తీసుకుంటారు. సభ్యులుగా ప్రభుత్వ స్థాయిలో ఉద్యోగ విరమణ చేసిన ఉన్నతస్థాయి వ్యక్తులు ఉన్నారు. వీరు పట్టించుకుంటే కళాశాల పరిస్థితుల్లో మార్పు వస్తుంది. అయితే ఆశాజనకమైన వాతావరణం కనిపించడం లేదు. ఈ పరిస్థితుల్లో ట్రస్టు ద్వారా ఆస్తులు, కళాశాలను లీజు పేరిట దక్కించుకునేందుకు ప్రయత్నాలు సాగుతున్నట్లు చెబుతున్నారు.

స్పందించని కార్యదర్శి

బీసెంట్ సెంటినరీ ట్రస్టులో ఇద్దరు టీడీపీ వర్గీయులకు సభ్యులుగా అవకాశం కల్పించారన్న ప్రచారంపై ట్రస్టు కార్యదర్శి సుధాకర్ దృష్టికి తీసుకెళ్లేందుకు పలుమార్లు ప్రయత్నించగా ఆయన స్పందించ లేదు. అలాగే ట్రస్టు సభ్యులైనట్లు ప్రచారం జరుగుతున్న వారిలో ఒకరి వివరణ కోసం ఫోన్‌లో ప్రయత్నించగా అందుబాటులోకి రాలేదు.

కూటమిపై తీరుపై అనుమానాలు

కళాశాల అభివృద్ధి విషయంలో కూటమి ప్రభుత్వం చూపిస్తున్న నిర్లక్ష్యం అనుమానాలకు ఊతమిస్తోంది. ఏడాది దాటినా కళాశాల స్థితగుతులపై పట్టించుకోకపోవడంతో తెర వెనుక టీడీపీ వర్గీయులకు కట్టబెట్టే వ్యూహం ఉందన్న అనుమానాలు బలపడుతున్నాయి. డిగ్రీ కళాశాల ప్రభుత్వం ఆధీనంలోకి వచ్చాక ఇక్కడి విద్యార్థుల సంఖ్య, ప్రస్తుత విద్యార్థుల సంఖ్య చూస్తేనే కూటమి ప్రభుత్వం ఎంతటి నిర్లక్ష్యం ప్రదర్శిస్తోందో స్పష్టం అవుతుంది.

తాళ్లపాకను సందర్శించిన టీటీడీ అధికారులు


గ్రామస్తులతో మాట్లాడుతున్న టీటీడీ అధికారులు

తాళ్లపాక(రాజంపేట) : పదకవితాపితామహుడు అన్నమాచార్యుల జన్మస్థలి తాళ్లపాకను టీటీడీ అధికారులు శనివారం సందర్శించారు. తాళ్లపాకను అభివృద్ధి చేసేందుకు కార్యాచరణ ప్రణాళికను రూపొందించడానికి ముందుగా టీటీడీ అధికారులు విలేజ్ విజిట్ నిర్వహించారు.టీటీడీ ఇంజినీరింగ్ ఎస్ఈ మనోహర్, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు నాగరాజు,నీటిపారుదలశాఖ ఎస్ఈ వెంకట్రామయ్యతో పాటు ఆర్‌అండ్‌బీ, పంచాయతీరాజ్‌కు చెందిన అధికారులు ఉన్నారు. కాగా ఈనెల7న టీటీడీ ఈవో శ్యామలరావును, బోర్డు సభ్యుడు భానుప్రకాశ్‌రెడ్డి నేతృత్వంలో గ్రామస్తులు కలిసి తాళ్లపాక అభివృద్ధికి సంబంధించి పలు అంశాలపై వినతులు సమర్పించారు. ఈ నేపథ్యంలో ఇక్కడికి వచ్చిన అధికారులు తాళ్లపాక రోడ్డును పరిశీలించారు. తాళ్లపాకు చెరువు కట్టపై ఉన్న రోడ్డుపై కవుల విగ్రహాలను ట్యాంక్‌బండ్ తరహాలో ఏర్పాటు చేయడానికి ప్రణాళిక రూపొందించారు. తాళ్లపాక చెరువులో శివలింగాన్ని, అన్నమయ్య పదక వితలు రాస్తున్నట్లుగా విగ్రహం ఏర్పాటుకు, చెరువును సుందరంగా తీర్చిదిద్దేందుకు అంచనాలు రూపొందించారు. ధ్యానమందిరం, నూతన కల్యాణమండపం పునరుద్ధరణ చేయాలని గ్రామస్తులు అధికారులను కోరారు. మరుగుదొడ్లు తొలగించి, వేరే ప్రదేశంలో నిర్మించాలన్నారు. ఈ ప్రతిపాదనలకు ఎస్టిమేట్లు వేసేందుకు టీటీడీ అధికారులు సానుకూలంగా స్పందించారు. బీజేపీ రాష్ట్ర కార్యదర్శి నాగోతు రమేష్‌నాయుడు, కార్యవర్గసభ్యుడు పోతుగుంట రమేష్‌నాయుడు, మాజీ సర్పంచ్ తనయుడు ఉద్దండం సుబ్రమణ్యం, గ్రామస్తులు జువ్వాది మోహనరావు, సుదర్శన్, తాళ్లపాక ఆలయాల ఇన్‌స్పెక్టర్ బాలాజీ పాల్గొన్నారు.

ధర్మప్రచారంలో అధర్మం!

- రంగంలోకి స్థానికేతర కళాకారులు
- లోపాయికారి ఒప్పందాలతో ప్రోగ్రాంల నిర్వహణ
- నీరుగాతున్న డీపీపీ లక్ష్యం


నందలూరు సౌమ్యనాథస్వామి బ్రహ్మోత్సవాలలో ఇతర ప్రాంతాల మహిళ కోలాట ప్రదర్శన

రాజంపేట : తిరుమల తిరుపతిదేవస్థానం ధర్మప్రచారపరిషత్(డీపీపీ) ధార్మిక ప్రచారం కోసం కృషిచేయాలి. అయితే ఇటీవల ఈ వ్యవస్థ సక్రమంగా పనిచేయడంలేదని విమర్శలు ఉన్నాయి. పర్యవేక్షణ డొల్లగా ఉందనే భావన ఉంది. ధర్మప్రచారపరిషత్ ముసుగులో ఆదాయ వనరులను అన్వేషించుకుంటున్నారు. పరోక్షంగా శ్రీవారి సొమ్ముకు ఎసరు పెడుతున్నారనే అపవాదును మూటకట్టుకుంది. డీపీపీ లక్ష్యం నీరుగారుతోందన్న విమర్శలున్నాయి. హిందూధర్మాని విస్తృతంగా ప్రచారం చేయాల్సిన డీపీపీ పక్కదారిలో నడుస్తోందన్న అపవాదు ఉంది. ఇదే అంశం ఇప్పుడు ఆధ్యాత్మికవేత్తలలో చర్చనీయాంశంగా మారింది.

టీటీడీ ఆధీనంలో..

జిల్లాలో టీటీడీ ఆధీనంలో ఉన్న ఒంటిమిట్ట, నందలూరు, తాళ్లపాకతోపాటు ఇతర ఆలయాల్లో జరిగే ఉత్సవాలు, ధార్మిక కార్యక్రమాలు, భజనలు లాంటివి ధర్మప్రచారపరిషత్ కనుసన్నల్లో జరుగుతన్న సంగతి తెలిసిందే. అయితే ఈ కార్యక్రమాల గురించి పెద్దగా ప్రచారం ఉండదు. ఇందులో భక్తులతో పాటు స్థానిక కళాకారులు కూడా పాల్గొనే పరిస్థితులు ఉండవన్న వాదన వినిపిస్తోంది. ఉదాహరణకు నందలూరులోని సౌమ్యనాథాలయం, తాళ్లపాక శ్రీ సిద్ధేశ్వర ఆలయం, శ్రీ చెన్నకేశవ ఆలయాల్లో వార్షిక బ్రహ్మోత్సవాలు జరుగుతున్నాయి. ఇక్కడి కార్యక్రమాలు ధర్మప్రచారపరిషత్ నేతృత్వంలో జరుగుతున్నాయి. ధార్మిక ఉపన్యాసాలు, కోలాటలు, చెక్కభజనలు తదితర ఆధ్యాత్మిక కార్యక్రమాలు ఏర్పాటుచేశారు.ఇందులో జిల్లాకు సంబంధించి కళాకారులు, భాగవతులకు అవకాశం ఇవ్వకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సంబంధిత అధికారి కార్యక్రమాలల్లో కనిపించరు. అంతా తిరుపతి నుంచి నడిపిస్తుంటారు. ఒంటిమిట్టలో జరిగే కార్యక్రమానికి గుండుసూది ప్యాకెట్ తిరుపతి నుంచి తెచ్చినట్లుగా బిల్లులు పెట్టుకోవడం గమనార్హం. ధర్మప్రచారపరిషత్ కార్యక్రమాల్లో నిర్వహణ లోపాయికారిగా జరుగుతోందని, ఉన్నవారితోనే సైక్లింగ్ చేస్తూ, కొత్తవారు, స్థానికులను తీసుకోవడంలేదనే విమర్శలున్నాయి.

- లక్షలాది రూపాయల జీతాలు తీసుకొనే ప్రభుత్వ ఉద్యోగులతో లోపాయికారి ఒప్పందాలు చేసుకొని కొనసాగిస్తున్నారు. జిల్లాలో ధార్మిక జీవనం చేస్తున్న వారిని ధర్మప్రచారపరిషత్ తీసుకోకపోవడం అనుమానాలకు తావిస్తోంది. ఒకే వ్యక్తి మూడుచోట్ల ధార్మికపనోస్యాలు చేస్తున్నారు. గత రెండేళ్లుగా కొంతమందిని ధర్మప్రచారపరిషత్ పెట్టుకొని నడిపిస్తోంది. రెండేళ్లలో రికార్డులు పరిశీలిస్తే అసలు విషయం వెలుగులోకి వస్తుంది.

స్థానికేతరులతో..

జిల్లాలో ప్రముఖ ఆలయాల్లో జరిగే ఉత్సవాలకు స్థానికేతర కళాకారులను తీసుకొచ్చి ధార్మిక కార్యక్రమాలను నిర్వహిస్తున్నారని, దీని వెనుక ఆంతర్యం ఏమిటో తెలియడంలేదని స్థానిక కళాకారులు వాపోతున్నారు. తమకు అవకాశం ఇవ్వాలని జిల్లాకు చెందిన భాగవతులు, కళాకారులు డీపీపీ అధికారులను కోరినా తిరుపతికి జిల్లాకు చెందిన ప్యానల్ సభ్యులు ఉన్నారని చెప్పారని కొందరు పెదవి విరుస్తున్నారు. తిరుపతితోపాటు ఇతర ప్రాంతాల నుంచి లోపాయికారి ఒప్పందాలతో జిల్లాలోని ఆలయాల్లో జరిగే ఉత్సవాలకు స్థానికేతరులను తీసుకొస్తున్నారు. ఇదంతా ఒక పక్కా ప్లాన్ జరుగుతుంటోంది.

కొరవడిన పర్యవేక్షణ

ధర్మప్రచారపరిషత్ నిర్వహణకు సంబంధించి సరైన పర్యవేక్షణ లేకపోవడంవల్లే శ్రీవారి సొమ్ము పక్క దోవ పడుతోందని, కొందరి ఉద్యోగుల జేబుల్లోకి వెళుతోందని ఆరోపణలు వెలువడుతున్నాయి.టీటీడీ విజిలెన్స్ విభాగం రెండేళ్ల రికార్డులు పరిశీలిస్తే అసలు వ్యవహారం వెలుగులోకి వస్తుందని అధ్యాత్మికవేత్తలు, స్థానిక కళాకారులు చెబుతున్నారు.

- ధర్మప్రచారపరిషత్ కార్యక్రమాలను స్థానికంగా ప్రచారం చేసేందుకు కరపత్రాలు ముద్రించి , గ్రామాల్లో పంపిణీ చేయాలి. ప్రతి ఆలయాల్లో జరిగే ఉత్సవాలు, ధార్మికోపన్యాసాలు, అధ్మాతిక ప్రవచనాలు, భజనలకు గురించి ప్రచారం కొరవడింది. కరపత్రాలను ముద్రించి ప్రచారం చేసినట్లుగా లెక్కలు చూపుతుండటం గమనార్హం.

ప్రోగ్రాం అసిస్టెంట్ ఏమంటున్నారంటే..

ధర్మ ప్రచారపరిషత్ కార్యక్రమాల్లో స్థానిక కళాకారులకు అవకాశం కల్పిస్తున్నామని డీపీపీ కడప, అన్నమయ్య జిల్లాల ప్రోగ్రాం అసిస్టెంట్ గోపిబాబు తెలిపారు. డీపీపీ తనదైన రీతిలో కార్యక్రమాలు చేసుకుంటూ పోతోందని, వస్తున్న ఆరోపణలు అవాస్తమని పేర్కొన్నారు. స్థానికంగా చాలామంది కళాకారులను అడిగామని, వారు రాకపోవడానికి అనేక కారణాలు చెప్పారని వివరించారు.

మెడికల్ కౌన్సిల్ నిర్ణయం కక్షపూరితం

మదనపల్లె : విదేశాల్లో వైద్యవిద్య చదివిన వారికి పర్మినెంట్ రిజిస్ట్రేషన్ ఆలస్యమైతే వైద్య కళాశాలల్లో ఒక ఏడాది ఇంటర్న్ షిప్ పూర్తి చేసుకునే అవకాశం ఇవ్వకుండా ఏపీ మెడికల్ కౌన్సిల్ కక్ష పూరితంగా వ్యవహరిస్తోందని ఏపీ నర్సింగ్ హోమ్స్ అధ్యక్షుడు, ఆల్ ఇండియా ఆర్గనైజింగ్ సెక్రటరీ ఏవీ.సుబ్బారెడ్డి అన్నారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ నెలరోజులుగా తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం పోరాడుతున్న ఫారిన్ మెడికల్ గ్రాడ్యుయేట్స్‌కు మద్దతు ఇస్తున్నట్లు చెప్పారు. ఈ విషయంలో మెడికో వంశీ న్యాయస్థానాన్ని ఆశ్రయించగా అనుకూలమైన తీర్పు వచ్చిందని అన్నారు. మెడికల్ కళాశాల కాంపెన్సేటరీ సర్టిఫికెట్ ఇచ్చిన తర్వాత ఆ సర్టిఫికెట్లు సరైనవి కావని పర్మినెంట్ రిజిస్ట్రేషన్ నిరాకరించే హక్కు ఏపీ మెడికల్ కౌన్సిల్‌కు లేదన్నారు.

వైఎస్సార్‌సీపీ బీసీ సెల్‌లో నియామకాలు

కడప కార్పొరేషన్ : వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఆ పార్టీ రాష్ట్ర బీసీ సెల్ కార్యదర్శులుగా వైఎస్సార్, అన్నమయ్య జిల్లాలకు చెందిన వారిని నియమిస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం ఉత్తర్వులు జారీ చేసింది. పులివెందులకు చెందిన వడ్డెరపు గంగాధర్ యాదవ్, రాయచోటికి చెందిన రమేష్ అంపాబత్తినలను నియమించారు. అలాగే అన్నమయ్య జిల్లా పీలేరు మండల పంచాయతీరాజ్ విభాగం అధ్యక్షుడిగా అంబవరం మల్లికార్జునరెడ్డిని నియమించారు.

రమణీయం..రథోత్సవం

- వైభవంగా సౌమ్యనాథస్వామి బ్రహ్మోత్సవాలు
- అధిక సంఖ్యలో తరలివచ్చిన భక్తులు


రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

నందలూరు : నందలూరు శ్రీ సౌమ్యనాథస్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా శనివారం మధ్యాహ్నం స్వామివారి రథోత్సవం రమణీయంగా సాగింది. పాంచరాత్ర ఆగమ పండితులు రఘునందన్, పవన్‌కుమార్, మనోజ్‌కుమార్, సునీల్‌కుమార్, సాయిస్వామి ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీదేవి భూదేవి సమేత శ్రీ సౌమ్యనాథస్వామిని రథంపై కొలువుదీర్చి ముందుకు కదిలించారు.భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. రథాన్ని లాగేందుకు పోటీపడ్డారు. గోవింద నామస్మరణలతో మాడవీధులు మార్మోగాయి. శనివారం రాత్రి అశ్వవాహనంపై సౌమ్యనాథ స్వామి పురవీధుల్లో విహరించారు. భక్తులు కాయ, కర్పూరం సమర్పించి మొక్కులను తీర్చుకున్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా రాజంపేట రూరల్ సీఐ బీవీ రమణ, ఎస్ఐ మల్లికార్జునరెడ్డి ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు. రథోత్సవానికి వచ్చిన భక్తులకు రీజెన్సీ నలంద విద్యాసంస్థల అధినేత జీఎన్ నాయుడు ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో సౌమ్యనాథ సేవ ట్రస్టు అధ్యక్షుడు ఎద్దుల సుబ్బరాయుడు, కోశాధికారి చక్రాల రామసుబ్బన్న, ఎద్దుల విజయసాగర్, ఆలయ సూపరిండెంట్ హనుమంతప్ప, ఆలయ ఇన్స్పెక్టర్ దిలీప్ కుమార్, విజిలెన్స్ అధికారి శేషాచలం, రీజెన్సీ నలంద స్కూల్ వైస్ ప్రిన్సిపల్ దశరథరామయ్య, ప్రిన్సిపల్ సుబ్బరాయుడు పాల్గొన్నారు.

నేడు చక్రస్నానం : బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం ఉదయం చక్రస్నానం, రాత్రి ధ్వజారోహణంతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయని ఆలయ ఇన్‌స్పెక్టర్ దిలీప్‌కుమార్ తెలిపారు.

క్లుప్తంగా

అదృశ్యమైన విద్యార్థి ఆచూకీ లభ్యం


జోష్ణవిని తల్లిదండ్రులకు అప్పగించిన ఎస్‌ఐ లోకేష్

పీలేరురూరల్ : పీలేరు పట్టణం బండ్లవంకలో నివాసం ఉంటున్న రాజశేఖర్, సునీత కుమార్తె జోష్ణవి (13) ఈ నెల 6వ తేదీ అదృశ్యమైన సంఘటన విదితమే. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు. శుక్రవారం జోష్ణవి తిరుమలలో ఉన్నట్లు గుర్తించిన అక్కడి పోలీసుల నుంచి సమాచారం అందింది. పీలేరు సీఐ యుగంధర్, ఎస్‌ఐ లోకేష్ ఆధ్వర్యంలో పోలీసులు తిరుమలకు వెళ్లి జోష్ణవిని తీసుకొచ్చి శనివారం తల్లిదండ్రులకు అప్పగించారు. అదృశ్యమైన జోష్ణవి సురక్షితంగా తిరిగిరావడంతో తల్లిదండ్రులు, బంధువులు ఊపిరి పీల్చుకున్నారు. పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు.

వైఎస్సార్‌సీపీ నాయకుడిపై దాడి


దాడిలో గాయపడిన లక్ష్మిరెడ్డి

లక్కిరెడ్డిపల్లి : మండలంలోని పందిళ్లపల్లి గ్రామం, దిన్నెపల్లికి చెందిన మాజీ ఫీల్డ్ అసిస్టెంట్, వైఎస్సార్‌సీపీ నాయకుడు లక్ష్మిరెడ్డిపై దాడి జరిగింది. తన పొలంలో ఉన్న బావిలో శనివారం సాయంత్రం మోటారును అమర్చుకుంటుండగా అదే గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు గంగిరెడ్డి తన అనుచరులతో కలిసి ఇనుపరాడ్లతో దాడి చేసి గాయపరిచారు. గాయపడిన లక్ష్మిరెడ్డిని బంధువులు లక్కిరెడ్డిపల్లి ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు లక్కిరెడ్డిపల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

బాలిక అదృశ్యం


రేష్మా

రైల్వేకోడూరు అర్బన్ : రైల్వేకోడూరు పట్టణంలోని చందనా థియేటర్ వద్ద నివాసం ఉంటున్న రజియా కుమార్తె రేష్మా (12) శనివారం అదృశ్యమైనట్లు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. హెచ్‌ఎంఎం హైస్కూల్‌లో తొమ్మిదో తరగతి చదువుతున్న రేష్మా గత మూడు రోజుల నుంచి కనిపించకపోవడంతో తల్లిదండ్రులు చుట్టుపక్కల బంధువులు, తెలిసిన వారిని విచారించారు. ఫలితం లేకపోవడంతో స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

యువకుడి ఆత్మహత్యాయత్నం

మదనపల్లె రూరల్ : తల్లి మందలించిందని, మనస్తాపంతో యువకుడు ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన శనివారం మదనపల్లెలో జరిగింది. పట్టణంలోని బుగ్గకాలువకు చెందిన అంజిమోహన, భారతి దంపతుల కుమారుడు తేజ్‌కుమార్(27) స్థానికంగా పండ్ల వ్యాపారం చేస్తుంటాడు. కుటుంబ సమస్యల కారణంగా తల్లి మందలించడంతో మనస్తాపం చెంది ఇంటివద్దే పురుగుమందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు జిల్లా ఆస్పత్రికి తరలించారు.

ప్రశ్నార్థకంగా హైవే కనెక్టివిటీ!

- ఒంటిమిట్ట, నందలూరుకు నేరుగా అనుసంధానం కోసం డిమాండ్
- సౌమ్యనాథాలయం, ఒంటిమిట్ట, తాళ్లపాకలను గుర్తించాలి
- అప్రోచ్‌రోడ్డు వల్ల యాత్రికుల రాకపోలకు సౌకర్యం



రాజంపేట : శేషాచలం అటవీ ప్రాంతంలో పచ్చటి ప్రకృతి ఒడిలో ఆహ్లాదకరమైన ప్రయాణం సాగించే గ్రీన్‌హైవే(కడప–రేణిగుంట నేషనల్ హైవే నుంచి అప్రోచ్‌రోడ్స్ నిర్మితం) ప్రశ్నార్థకంగా మారింది. తాజాగా కేంద్ర ప్రభుత్వం నుంచి హైవే నిర్మాణానికి అడ్డంకిగా ఉన్న వైల్డ్‌లైఫ్ అనుమతులు రావడంతో త్వరలోనే నిర్మాణ పనులు జరుగుతాయని భావిస్తున్నారు. రూ.4వేల కోట్ల వ్యయంతో రాయలసీమ జిల్లాలకు ముఖ్య రహదారిగా ప్రాచుర్యం పొందిన రహదారి అందుబాటులో తీసుకురావాలని కేంద్రం యోచిస్తోంది. ప్రధాన పుణ్య క్షేత్రాలైన ఒంటిమిట్ట, నందలూరు, తాళ్లపాకకు కనెక్టివిటీ అప్రోచ్‌రోడ్స్‌పై క్లారిటీ రాలేదన్న ఆందోళన ఇక్కడి ప్రాంతీయుల్లో నెలకొంది.

ఒంటిమిట్ట, నందలూరుకు వెళ్లేదెలా..

కడప–రేణిగుంట నేషనల్ హైవేలో సుప్రసిద్ధ పుణ్యక్షేత్రాలైన ఒంటిమిట్ట, నందలూరుకు యాత్రికులు, భక్తులు, పర్యాటకులు వెళ్లేదేలా అన్న సందేహాలు పుట్టుకొచ్చాయి. రాష్ట్ర అధికారిక రామాలయం ఒంటిమిట్టలో ఉంది. అలాగే దక్షిణ భారతదేశంలో ప్రసిద్ధి చెందిన వైష్ణవ ఆలయం సౌమ్యనాథాలయం నందలూరులో ఉంది. ఈ రెండు కేంద్రాలకు ప్రత్యేకంగా సర్వీసు రోడ్డును తీసుకురావాలని, అవసరమైతే భూసేకరణ చేసైనా నిర్మించాలనే డిమాండ్ తెరపైకి వచ్చింది. ఈ విషయంలో నందలూరు, ఒంటిమిట్ట వాసులు ఆందోళన చేయడానికి సన్నద్ధమవుతున్నారు.

- మేజర్ పంచాయతీ కేంద్రమైన నాగిరెడ్డిపల్లె శివార్లలో నుంచి నిర్మితం కానున్న కడప–రేణిగుంట హైవే నుంచి నందలూరు బస్టాండు కేంద్రానికి కనెక్టివిటీని కోరుతున్నారు.
- ఒంటిమిట్టకు రాములోరి కల్యాణ మండపం సమీపం నుంచి ఇస్తే పుణ్యక్షేత్రాల సందర్శనకు అనుకూలంగా ఉంటుందని యాత్రికులు కోరుతున్నారు.
- ఒంటిమిట్ట, నందలూరు మండల కేంద్రాలకు సంబంధం లేని ఏరియాలో సుదూర ప్రాంతంలో అప్రోచ్‌రోడ్డు ఇవ్వడం వల్ల ఉపయోగం లేదని పేర్కొంటున్నారు.
- అలాగే పద కవితా పితామహుడు తాళ్లపాక అన్నమాచార్యులు జన్మస్థలి తాళ్లపాక–నందలూరు కనెక్టివిటీ దగ్గరగా ఉంటుంది.

దక్షిణ భారతీయులకు..

మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల నుంచి నిత్యం వేలాదిమంది ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన తిరుపతి, చెన్నై నగరాలకు వెళ్లే వారు ఈ హైవేలో అధికంగా పయనిస్తారు. అలాంటి పరిస్థితుల్లో ఒంటిమిట్ట, నందలూరుకు నేరుగా కనెక్టివిటీ లేకపోవడం అసౌకర్యం కలిగిస్తుంది. ప్రస్తుతం ఉన్న రోడ్డు సర్వీసు (కడప–రేణిగుంట పాతరోడ్డు) రోడ్డుగా మారుతుంది. ఈ దారిలో దూరప్రాంతాలకు చెందిన హైవేలోనే తిరుపతి, చెన్నై తదితర ప్రాంతాలకు వెళ్లనున్నారు. పైగా త్వరితగతిన గమ్యానికి చేరుకునే వీలు కలుగుతుంది. హైవేలో పయనించనున్నారు.

ఎంపీల దృష్టికి పుణ్యక్షేత్రాల కనెక్టివిటీ..

జిల్లాలో ప్రసిద్ధి చెందిన పుణ్యక్షేత్రాలైన నందలూరు, ఒంటిమిట్ట కేంద్రాలకు ఎన్‌హెచ్ నుంచి కనెక్టివిటీ రోడ్ (సర్వీసురోడ్డు) అవసరమని రాజంపేట లోక్‌సభ సభ్యుడు పీవీ మిథున్‌రెడ్డి, రాజ్యసభ సభ్యుడు మేడా రఘునాథరెడ్డిల దృష్టికి తీసుకెళ్లే ప్రయత్నాలు జరుగుతున్నాయి. వివిధ ప్రాంతాల నుంచి తిరుపతికి వెళ్లే యాత్రికులు ఒంటిమిట్ట రామయ్య, సౌమ్యనాథుని దర్శించుకోవడం ఇటీవల అధికమైంది. అంతేగాకుండా రాయలసీమలో తొలిసారిగా బయల్పడిన బౌద్ధారామాలున్నాయి. పర్యాటకపరంగా ప్రాచుర్యం పొందిన ఒంటిమిట్ట, నందలూరుకు ఎన్‌హెచ్ నుంచి ప్రత్యేకంగా సర్వీసు రోడ్డు నిర్మితం చేయించేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

నందలూరుకు నేరుగా కనెక్టివిటీ అవసరం



పుణ్యక్షేత్రాలుగా భాసిల్లుతున్న ఒంటిమిట్ట, నందలూరుకు త్వరలో నిర్మితం కానున్న గ్రీన్‌హైవే నుంచి నేరుగా కనెక్టివిటీ అవసరం ఉంది. అప్రోచ్‌రోడ్డు లింక్ నాగిరెడ్డిపల్లె నుంచి నందలూరు బస్టాండుకు ఉండాలి. ఎక్కడో మండలానికి దూరంగా కనెక్టివిటీ అక్కర్లేదు. అన్ని రాష్ట్రాల నుంచి భక్తుల సంఖ్య పెరిగింది. సౌమ్యనాథాలయం, సీమలో తొలిసారిగా బయల్పడిన బౌద్ధారామాలు, సమీపంలోని అన్నమయ్య జన్మస్థలి తాళ్లపాక ఉన్నాయనే నేషనల్ హైవే అధికారులు గుర్తించాలి.

–మేడా విజయభాస్కర్‌రెడ్డి, ఎంపీపీ, నందలూరు

హైవే నుంచి ఒంటిమిట్టలోకి కనెక్టివిటీ రోడ్డు వేయాలి



త్వరలో నిర్మితం కానున్న గ్రీన్‌హైవే(కడప–రేణిగుంట నేషనల్‌హైవే) నుంచి పుణ్యక్షేత్రాలైన ఒంటిమిట్టకు సర్వీసు రోడ్డు నిర్మితం చేయాలి. ఇప్పటి వరకు ఆ ప్రతిపాదనలు లేవన్న ఆందోళన ఒంటిమిట్ట ప్రాంతీయులను కలచి వేస్తోంది. ఎక్కడో అటవీ ప్రాంతంలో అప్రోచ్‌రోడ్డు నిర్మితం చేయడం వల్ల ఉపయోగంలేదు. రామయ్య కోవెలకు అనుకూలంగా అప్రోచ్‌రోడ్డు నిర్మించాల్సిన అవసరం ఉంది.

– ఇరగంరెడ్డి సుబ్బారెడ్డి, జెడ్పీ మాజీ వైస్‌చైర్మన్, ఒంటిమిట్ట

వైభవంగా చెన్నకేశవస్వామి రథోత్సవం


తాళ్లపాకలో శ్రీ చెన్నకేశవస్వామి రథోత్సవం

రాజంపేట : తాళ్లపాక బ్రహ్మోత్సవాలలో భాగంగా శ్రీ చెన్నకేశవస్వామికి శనివారం రాత్రి రథోత్సవం వైభవంగా నిర్వహించారు. ముందుగా శ్రీదేవి, భూదేవి, శ్రీ చెన్నకేశవస్వామి ఉత్సవమూర్తులను సుందరంగా అలంకరించారు. రథం వేదికపై ఆసీనులు చేశారు. ఇందులో భాగంగా ప్రత్యేకపూజలు నిర్వహించారు. అలాగే ఉదయం శ్రీ సిద్దేశ్వరస్వామి అమ్మవార్లకు పల్లకీ సేవ నిర్వహించారు. కాగా ఆదివారం శ్రీ సిద్దేశ్వరస్వామికి పార్వేటి ఉత్సవం నిర్వహించనున్నారు. శ్రీ చెన్నకేశవస్వామి అశ్వవాహనంపై భక్తులకు దర్శనమివ్వనున్నారు. రథోత్సవ కార్యక్రమంలో సర్పంచ్ గౌరీశంకర్, తాళ్లపాక ఇన్‌స్పెక్టర్ బాలాజీ, టీటీడీ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

పిచ్చి కుక్క దాడిలో ముగ్గురికి గాయాలు

సిద్దవటం : మండల కేంద్రమైన సిద్దవటం ఎగువపేటలో శనివారం పిచ్చికుక్క స్వైర విహారం చేసి ముగ్గురికి కాటు వేసింది. ఎగువపేట మఠం వీధిలో శనివారం సాయంత్రం తొమ్మిదేళ్ల బాలుడు ఆడుకుంటుండగా ఒక్కసారిగా కుక్క వచ్చి కరిచింది. అలాగే పోలీసు లైన్ సమీపంలో ఆరేళ్ల బాలుడిని, మెయిన్ బజారులో తేజా అనే యువకుడిని కూడా కరిచింది. కుక్క కాటుకు గురైన వారు సిద్దవటం ప్రభుత్వ ఆసుపత్రిలో వ్యాక్సిన్, ఇంజక్షన్ వేయించుకున్నారు. గ్రామ పంచాయతీ అధికారులు స్పందించి పిచ్చి కుక్కను పట్టుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

జెర్సీ ఆవు పొడిచి మహిళ మృతి


మృతి చెందిన సుజాతమ్మ (45)

లక్కిరెడ్డిపల్లి: మండలంలోని గుద్దగుంట్లరాచపల్లెకు చెందిన ఎస్.సుజాతమ్మ (45)ను జెర్సీ ఆవు పొడవడంతో మృతి చెందింది. బంధువుల వివరాల మేరకు పంట పొలాల్లో తమకున్న ఆవులను మేపుకోవడానికి వెళ్లిన సుజాతమ్మపైకి ఉన్నట్టుండి ఆవు దూసుకొచ్చి పైకి లేపి కిందపడేసింది. ఈ సంఘటనను గమనించిన మరో మహిళ బంధువులకు సమాచారం అందించింది. వెంటనే వారు లక్కిరెడ్డిపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి మెరుగైన వైద్యం కోసం రాయచోటికి తీసుకెళ్తుండగా మార్గమధ్యంలోనే మృతి చెందింది. పోస్టుమార్టం నిమిత్తం లక్కిరెడ్డిపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి సుజాతమ్మ మృతదేహాన్ని తరలించారు. లక్కిరెడ్డిపల్లి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

మనవడి దాడిలో గాయపడిన అవ్వ మృతి

పెద్దమండ్యం : మనవడి దాడిలో గాయపడిన వృద్ధురాలు శుక్రవారం రాత్రి మృతి చెందింది. పోలీసులు, మృతురాలి మరో మనమడు శనివారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు వివరాలిలా ఉన్నాయి. మండలంలోని దిగువపల్లెకు చెందిన ఆర్.లక్ష్మయ్య భార్య మల్లమ్మ (79) కు నలుగురు కుమారులు ఉన్నారు. భర్త చనిపోవడంతో నలుగురు కుమారులు తల్లి పోషణను నెలకు ఒకరు చూసుకునేలా నిర్ణయించుకున్నారు. ఈ క్రమంలో మూడవ కుమారుడు ఆర్.చంద్రశేఖర నాయుడు వంతు రాగా, జూలై 1 న అతని ఇంటికి వెళ్లింది. వృద్ధురాలి పోషణ విషయమై చంద్రశేఖరనాయుడు, భార్య భాగ్యమ్మ తరచూ గొడవ పడుతుండేవారు. ఈ నేపథ్యంలో గురువారం భార్యాభర్తలు మరోసారి గొడవపడ్డారు.ఈ విషయాన్ని కుమారుడు నాగేంద్రకు తల్లి భాగ్యమ్మ ఫోన్ ద్వారా సమాచారం ఇచ్చింది. ఈ గొడవలకు కారణం నాన్నమ్మ అని చెప్పడంతో ఇటుక రాయితో నాగేంద్ర అవ్వపై దాడి చేయడంతో స్పృహ తప్పి పడిపోయినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. కుటుంబ సభ్యులు గాయపడిన వృద్ధురాలిని 108 వాహనంలో తంబళ్లపల్లె ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం తిరుపతి రూయా ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందింది. ఈ మేరకు మృతురాలి మరో మనుమడు ఆర్.రాజశేఖరనాయుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ ఎం.వెంకటేశ్వర్లు తెలిపారు. సంఘటన స్థలాన్ని మదనపల్లె డీఎస్పీ మహేంద్ర పరిశీలించారు.

ఆటో బోల్తా

సుండుపల్లె : ఆటో బోల్తా పడిన సంఘటనలో ఇద్దరికి తీవ్ర గాయాలైన సంఘటన శనివారం సాయంత్రం జరిగింది. వివరాలిలా.. మండల పరిధిలోని బోడెప్పగారిపల్లికి చెందిన మల్లయ్య నాయుడు, శిరీష ఆటోలో వారి స్వగ్రామం నుంచి సుండుపల్లెకు బయలుదేరారు. మార్గమధ్యంలో వానరాచపల్లి బిడికి సమీపంలో ఆటో బోల్తా పడడంతో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. గాయపడిన వారిని 108 వాహనంలో రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

పాల కొండలు అటవీ ప్రాంతంలో కూంబింగ్


కూంబింగ్ నిర్వహిస్తున్న కడప రేంజ్ సిబ్బంది

సిద్దవటం : పాలకొండలు అటవీ ప్రాంతంలోని సమస్యాత్మక ప్రదేశాల్లో కూంబింగ్ నిర్వహించినట్లు కడప రేంజర్ ప్రసాద్ తెలిపారు. సిద్దవటం మండలంలోని రాజీవ్ స్మృతి వనంలో శనివారం ఆయన మాట్లాడుతూ కడప డీఎఫ్‌ఓ వినీత్‌కుమార్ ఆదేశాల మేరకు కడప ఫారెస్టు రేంజ్ పరిధిలోని పాలకొండలు అటవీ ప్రాంతమైన భాకరాపేట ఫారెస్టు బీటులో అనుమానిత అటవీ ప్రాంతాల్లో ఎర్రచందనం తరలి పోకుండా కూంబింగ్ నిర్వహించామన్నారు. భాకరాపేట, మిట్టపల్లి, నేకపాపురం మాచుపల్లె, మూలపల్లె తదితర గ్రామాల్లో కొత్త వ్యక్తులు ఎవరైనా అనుమానితులుగా కనబడితే సమాచారం ఇవ్వాలని కోరారు. ఈ సమావేశంలో ఫారెస్టు సెక్షన్ ఆఫీసర్ శ్రీనివాసులు, సిబ్బంది కిషోర్‌కుమార్, ఇందిర, ప్రొటెక్షన్ వాచర్లు పాల్గొన్నారు.

న్యాయ వ్యవస్థలో మీ పాత్ర కీలకం

కోర్టు విధులు నిర్వర్తిస్తున్న సిబ్బందితో జిల్లా అదనపు ఎస్పీ


కోర్టు, పోలీసు సిబ్బందితో సమీక్షిస్తున్న జిల్లా అదనపు ఎస్పీ వెంకటాద్రి

రాయచోటి : న్యాయ వ్యవస్థలో మీరు పోషిస్తున్న పాత్ర అత్యంత కీలకమైందని, కోర్టు కార్యకలాపాలు సజావుగా సాగడానికి, కోర్టుల గౌరవాన్ని నిలబెట్టడానికి మీ కృషి ప్రశంసనీయమని జిల్లా అదనపు ఎస్పీ వెంకటాద్రి అన్నారు. శనివారం రాయచోటిలోని అన్నమయ్య జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో రాష్ట్ర డీజీపీ హరీష్ కుమార్ గుప్తా, జిల్లా ఎస్పీ వి.విద్యాసాగర్ నాయుడుల ఆదేశాల మేరకు జిల్లాలోని కోర్టు కానిస్టేబుళ్లు, హెడ్ కానిస్టేబుళ్లు, లైజనింగ్ ఆఫీసర్లు, జిల్లా లీగల్ లైజన్ యూనిట్ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోర్టుకు హాజరయ్యే ప్రజలు, న్యాయవాదులు, న్యాయమూర్తులతో నేరుగా వ్యవహరిస్తారన్నారు. ఈ క్రమంలో మీరు ప్రదర్శించే నిబద్ధత, నిజాయితీ, వృత్తి నైపుణ్యం చాలా ముఖ్యమైనవన్నారు. కేసుల విచారణకు అవసరమైన పత్రాలను సమర్పించడం నుంచి సాక్షులను కోర్టుకు హాజరుపరచడం వరకు మీరు చేసే ప్రతి పనిలో కచ్చితత్వం, సమయపాలన పాటించాలని సూచించారు. కోర్టు అధికారులు, న్యాయవాదులతో సమర్థవంతమైన సమన్వయం చేసుకోవడం ద్వారా కేసుల పురోగతికి సహాయపడాలని కోరారు. సాక్షులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా వాంగ్మూలం ఇచ్చే వాతావరణం కల్పించాలన్నారు. కోర్టు ప్రాంగణం, వెలుపల బాధ్యతాయుతంగా వ్యవహరించి పోలీసు శాఖకు మంచి పేరు తీసుకురావాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా డీసీఆర్‌బీ ఇన్‌స్పెక్టర్ ఎం.తులసీరాం, డిస్ట్రిక్ట్ లీగల్ లైజన్ యూనిట్ ఇన్‌స్పెక్టర్ ఆదినారాయణ రెడ్డి, ఎస్‌ఐ రవికుమార్, జిల్లా వ్యాప్తంగా కోర్టు విధులు నిర్వహిస్తున్న పోలీసులు పాల్గొన్నారు.

రాత్రి రెక్కీ.. పగలు నొక్కి..

- చోరీ కేసులో నిందితుడి అరెస్టు
- 102 గ్రాముల బంగారు, రూ.75 వేలు నగదు స్వాధీనం


నిందితుడి అరెస్టు వివరాలు వెల్లడిస్తున్న అడిషనల్ ఎస్పీ వెంకటాద్రి

రాయచోటి టౌన్ : తాళాలు వేసిన ఇళ్లను లక్ష్యంగా చేసుకుని చోరీలకు పాల్పడుతున్న నిందితుడిని అరెస్టు చేసినట్లు అడిషనల్ ఎస్పీ వెంకటాద్రి తెలిపారు. శనివారం రాయచోటి రూరల్ పోలీస్ స్టేషన్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఆయన కథనం మేరకు.. తిరుపతి జిల్లా గూడూరు, గాంధీనగర్‌కు చెందిన రంగనాథం కిరణ్ బేకరీలో పనిచేసేవాడు. అక్కడ వచ్చే ఆదాయం చాలకపోవడంతో దొంగతనాలకు అలవాటుపడ్డాడు. తొలుత బస్టాండ్ ఆవరణంలో చిన్న చిన్న జేబుదొంగతనాలు చేసేవాడు. అక్కడ కూడా పెద్ద మొత్తంలో డబ్బులు రాకపోవడంతో ఇళ్లలో చోరీలు చేయడం మొదలు పెట్టాడు. చోరీ చేసే ముందు రెండు,మూడు రోజులు ఆ ప్రాంతంలో రాత్రి వేళల్లో రెక్కీ నిర్వహిస్తాడు. ఇంటిలో ఎవరూ లేరని నిర్ధారించుకున్న తరువాత పగటి పూటే చోరీలు చేసేవాడు. ఈ క్రమంలో అన్నమయ్య జిల్లాలోని చిట్వేలిలో రెండు కేసులు, రైల్వేకోడూరులో ఒకటి, వీరబల్లిలో మూడు కేసులతో పాటు ఇతర జిల్లాల్లో 56 కేసులు ఇతనిపై నమోదయ్యాయి. ఈ నేపథ్యంలో వీరబల్లిలో జరిగిన ఒక చోరీ సంఘటనలో నిఘా పెట్టిన పోలీసులకు శనివారం వీరబల్లి మండలం ఓదివీడు రోడ్డు వద్ద నిందితుడు కనిపించడంతో రూరల్ సీఐ వరప్రసాద్, సీసీఎస్ ఇన్‌స్పెక్టర్లు యం. చంద్రశేఖర్, ఎస్‌ఐలు కృష్ణారెడ్డి, వీరబల్లి ఎస్‌ఐ నరసింహారెడ్డిలు అదుపులోకి తీసుకున్నారు. నిందితుడి నుంచి 102 గ్రాముల బంగారు ఆభరణాలు, రూ.75,000 నగదు స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ రూ.10,75,000లుగా గుర్తించినట్లు తెలిపారు. నిందితుడిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. సమావేశంలో డీఎస్పీ ఎంఆర్ కృష్ణమోహన్, ఎస్‌ఐలు కృష్ణారెడ్డి, నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల అదుపులో రాయచోటి వాసులు !

రాజంపేట : సోషల్ మీడియాలో టీడీపీ రాజంపేట పార్లమెంటరీ జిల్లా అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్‌రాజుపై ఆయన పరువుకు భంగం కలిగించేలా వీడియోను పోస్టు చేశారని రాజంపేటకు చెందిన టీఎన్‌ఎస్‌ఎఫ్ నేత శివకుమార్ పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. శుక్రవారం రాత్రి కేసు నమోదు చేశారు. ఈ కేసుకు సంబంధించి రాయచోటికి చెందిన రామచంద్ర, రామకృష్ణ, సూరిలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కాగా టీడీపీ ఇన్‌చార్జి రేసులో చమర్తి కూడా ఉన్న నేపథ్యంలో ఇప్పుడు తెరపైకి వచ్చిన సోషల్ మీడియా పోస్టు పెట్టడానికి కారణమనే భావన తెలుగు తమ్ముళ్లలో చర్చనీయాంశంగా మారింది.

టీడీపీ వర్గాల్లో దుమారం రేపిన వీడియో...

పోలీసుల అదుపులో ఉన్న వారు విడుదల చేసినట్లుగా చెబుతున్న వీడియో టీడీపీ వర్గాల్లో దుమారం రేపింది. టీడీపీలో చమర్తి వ్యతిరేక వర్గానికి చెందిన వారే వీడియో వైరల్ చేశారనే భావనలో చమర్తి వర్గీయులు ఉన్నారు. రాయచోటికి చెందిన వారి వెనుక ఉన్న నేత ఎవరు అనే దిశగా పోలీసులు విచారణ చేస్తున్నారు. ఈ విషయంపై పట్టణ సీఐ రాజాను వివరణ కోరగా సోషల్ మీడియాలో చమర్తి జగన్‌మోహనరాజుపై వీడియో విడుదల చేసిన వారిని విచారిస్తున్నామని వెల్లడించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి


గాయపడిన వ్యక్తిని ఆసుపత్రికి తరలిస్తున్న ఎస్‌ఐ పి.మహేష్ నాయుడు

ఓబులవారిపల్లె ; చిన్న ఓరంపాడులోని నాయుడు డాబా వద్ద జాతీయ రహదారిపై శనివారం మధ్యాహ్నం ఇన్నోవా కారు ఢీ కొనడంతో సోమశిల శ్రీనివాసులు (55) అనే వ్యక్తి మృతి చెందాడు. స్థానికుల కథనం మేరకు.. చెన్నూరు పడమటి వీధి గ్రామానికి చెందిన సోమశిల శ్రీనివాసులు మండలంలోని చిన్న ఓరంపాడు గ్రామంలో నివాసం ఉంటున్నాడు. ఇక్కడ తమలపాకు తోటల్లో కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ప్రతిరోజూ లాగే తోటలో పని ముగించుకొని మధ్యాహ్నం భోజనం కోసం నాయుడు డాబా వద్దకు జాతీయ రహదారిపై వస్తుండగా వేగంగా ఇన్నోవా కారు ఢీ కొంది. దీంతో శ్రీనివాసులు తలకు తీవ్ర గాయాలయ్యాయి. ఎస్‌ఐ మహేష్ నాయుడు సిబ్బందితో కలిసి ప్రమాద స్థలానికి చేరుకొని 108 వాహనంలో శ్రీనివాసులును రైల్వేకోడూరుకు తరలించారు. మార్గమధ్యంలో శ్రీనివాసులు మృతి చెందాడు. మృతునికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. భార్య జీవనోపాధి కోసం గల్ఫ్ దేశానికి వెళ్లింది. ఇద్దరు కుమారులు స్వగ్రామంలో ఉన్నారు. కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు ఎస్‌ఐ పి.మహేష్ నాయుడు తెలిపారు.

వక్ఫ్‌బోర్డు స్థలంలో భారీ అగ్ని ప్రమాదం

ప్రొద్దుటూరు : మండల పరిధిలోని టీచర్స్ కాలనీ వెనుక ఉన్న వక్ఫ్‌బోర్డు స్థలంలో భారీ అగ్ని ప్రమాదం సంభవించింది. ఆ స్థలంలో ఉన్న టైర్లతోపాటు ప్లాస్టిక్ వ్యర్థాలకు నిప్పు అంటుకోవడంతో దట్టమైన పొగలు లేచాయి.